డాక్టర్లు లేని దవాఖానాలు!

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షాకత్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత
- డాక్టర్లు లేక రోగుల అవస్థలు
- మరోవైపు అద్దె భవనంలో జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రం



అద్దె భవనంలో కొనసాగుతున్న జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రం



బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బంజారాహిల్స్: రోగులకు వైద్య సేవలు అందించాల్సిన అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సరైన సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. మెజార్టీ బస్తీ దవాఖానాల్లో చాలావరకు కాంట్రాక్ట్ వైద్యులు సేవలందిస్తుండగా మరికొన్ని ఆస్పత్రులు, బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. బంజారాహిల్స్ రోడ్ నెం.7 లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగ కార్తీక్ 15 రోజుల క్రితం రాజీనామా చేసి వెళ్లడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. బంజారాహిల్స్‌లోని పలు బస్తీలకు కీలకంగా ఉన్న ఈ ఆస్పత్రికి నిత్యం పెద్ద సంఖ్యలో గర్భిణులతోపాటు వారంలో రెండు రోజులపాటు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. కీలకంగా ఉన్న ఈ ఆస్పత్రిలో వైద్యుడు లేడని స్థానికులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా ఇప్పటి వరకు కనీసం ఇన్‌చార్జి డాక్టర్‌ను సైతం నియమించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ ఉండాల్సిన ఫార్మసిస్ట్ బదిలీ అయ్యారు. ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. దీంతో ఉన్న సిబ్బందితోనే ఆస్పత్రిలో సేవలు కొనసాగుతున్నాయి. మరో వైపు దీనికి కొద్ది దూరంలోనే ఉన్న షాకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం డాక్టర్ లేకపోవడం గమనార్హం. షాకత్‌నగర్ ఆరోగ్య కేంద్రానికి జూబ్లీహిల్స్ పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యుడికి వారంలో మూడు రోజులు సేవలు అందించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆరు నెలలుగా జూబ్లీహిల్స్ వైద్యులు షాకత్‌నగర్ ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నాడు. తాజాగా జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రంలోని వైద్యుడు కూడా బదిలీ అయినట్లు సమాచారం. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షాకత్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల కొరత వేధిస్తున్నది. మరోవైపు బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని బస్తీ దవాఖానాలో సైతం వైద్యురాలు మెటర్నిటీ లీవ్‌లో వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇక్కడ కూడా సేవలకు ఆటంకం కలుగుతున్నది. ఎంతో మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు సైతం సరైన సిబ్బంది లేకపోవడంతో నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అద్దె భవనంతో అవస్థలు..

జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రం గత కొన్ని సంవత్సరాలుగా అన్నపూర్ణ స్టూడియో ఎదురుగా ఉన్న జవహర్‌కాలనీలోని ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. కాగా ఆ భవన యజమానికి సరైన సమయంలో అద్దె చెల్లించకపోవడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఆ యజమానికి ప్రభుత్వం నుంచి అద్దె రాకపోవడంతో రోజూ గొడవలు తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు. కొన్నిసార్లు ఆ భవన యజమాని బాత్‌రూమ్‌లకు తాళాలు వేసుకోవడంతో పాటు కొన్ని గదులకు తాళాలు వేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ భవనంలో సైతం సరైన నీటి వసతి లేక డ్రమ్ముల్లో నీటిని పట్టుకోవాల్సి వస్తున్నది. ఏడాది క్రితం జూబ్లీహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించేందుకు సాగర్ సొసైటీని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం వద్ద రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించినా కూడా ఇప్పటి వరకు అక్కడ భవనం నిర్మాణ పనులు మొదలు కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పైపులైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్‌లోని డీ సెక్షన్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం విద్యాసాగర్, బీఆర్ఎస్ నాయకులు లంగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, రామప్ప, రాజు పాల్గొన్నారు.

'కేటీఆర్ ట్వీట్ అవగాహనరాహిత్యం'



కోట నీలిమా

సనత్‌నగర్: వాహన రిజిస్ట్రేషన్లను టీఎస్ నుంచి టీజీకి మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 1000 కోట్ల టెండర్‌ను శ్రీనాథ్ స్మార్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కట్టబెట్టిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ట్వీట్ చేయడం ఆయన అవగాహనారాహిత్యానికి అద్దం పడుతుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమా శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సదరు టెండర్ ఫొటో విడుదల చేస్తూ రూ.1.37 కోట్లను 1000 కోట్లుగా వక్రీకరించి తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రజలు అమాయకులు కారన్నారు. పరిపక్వత లేని రాతలతో దాడి చేస్తే, ప్రతి దాడి తప్పదనే విషయం గుర్తించుకోవాలన్నారు. ఇలాంటి దిగజారుడు మాటల వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు.

వైద్యులే నిజమైన హీరోలు



వైద్య విద్యార్థులు, సిబ్బందితో ట్రాఫిక్ పోలీసులు

అమీర్‌పేట: ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులే నిజమైన హీరోలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. అమీర్‌పేట ప్రకృతి ఆసుపత్రిలో వైద్య విద్యార్థులు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై శనివారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.50 వేల జరిమానాతో పాటు 3 నెలల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. గతేడాది లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 3300 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం



జీ సంగీత

లాలాపేట: ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీఐఎల్ కాప్రా గాంధీనగర్‌కు చెందిన జి. సంగీత ఆంధ్ర మహిళా సభ ఉమెన్స్ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 2న కాలేజీకి వెళ్లింది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సోదరి పూజిత కాలేజీకి వెళ్లి సంగీతను కలిసి ఇంటికి చేరుకోగా సంగీత మాత్రం రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో తండ్రి లక్ష్మణ్ ఓయూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ మోడల్ స్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థి..



అలకుంట ధనుష్

మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అలకుంట నాగరాజు కుమారుడు ధనుష్ ఉస్మానియా యూనివర్సిటీ మోడల్ స్కూల్లో టెన్త్ క్లాస్ చదువుతున్నాడు. ఈ నెల 3న ఉదయం స్కూల్‌కు వెళ్లాడు. సాయంత్రం 4–30 గంటలకు ధనుష్‌ను పికప్ చేసుకునేందుకు నాగరాజు వెళ్లేసరికి స్కూల్లో ధనుష్ లేడు. వాచ్‌మెన్‌ను అడిగితే స్కూల్ నుంచి బయటకు వెళ్లినట్లు చెప్పాడు. ఇప్పటికీ ఇంటికి రాలేదు. దీంతో దీంతో తండ్రి నాగరాజు ఓయూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ ఆస్పత్రిలో లూయీ బ్రెయిలీ జయంతి



వైద్య విద్యార్థులు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాంధీ పాలనాధికారులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తమాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రవిశేఖరరావు నేతృత్వంలో వైద్యవిద్యార్థులు రూపొందించిన పోస్టర్‌ను గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బ్రెయిలీ తన నూతన ఆవిష్కరణతో కంటిచూపు వైకల్యానికి చెక్ పెట్టాడన్నారు. 1809 జనవరి 4న ఫ్రాన్స్‌లోని కూప్రే అనే కుగ్రామంలో లూయీ బ్రెయిలీ జన్మించాడని, బ్రెయిలీ లిపి సృష్టికర్త పుట్టినరోజును ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అలాగే వైద్య విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ-1 శేషాద్రి, వైద్యులు సృజన, ప్రావీణ్యతో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వాసుపత్రి నిర్మించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాణికేశ్వర్‌నగర్ నాయకులు

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని కోరుతూ మాణికేశ్వర్‌నగర్ వడ్డెర బస్తీ నాయకులు హైదరాబాద్ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ నాయకులు మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో దవాఖాన నిర్మించాలంటూ బస్తీ వాసులమంతా దాదాపు 150 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే హాస్పిటల్ నిర్మిస్తామని చెప్పి దీక్షలు విరమింపజేశారని తర్వాత పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను కూడా కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డుమెంబర్ లాజరస్, సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్, కాంగ్రెస్ డీసీసీ సెక్రటరీ వరికుప్పల రవి, గండికోట వెంకటేష్, ఏ. లింగయ్య, జైదీప్, అశోక్, నర్సింహ, బోదాసు వెంకటేష్, ముత్తయ్య, పల్లపు కుమార్, కే నర్సింహ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించొద్దు



ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత

లాలాపేట: ఇందిరమ్మ ఇళ్ల కోసం మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి గ్రేటర్ ప్రజలకు సూచించారు. తార్నాకలోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించి సర్వే తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో దాదాపు 10 లక్షల మంది ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇళ్లు మంజూరు చేస్తున్న నేపథ్యంలో సర్వేను మరింత వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈనెల 10 వరకు సర్వే కొనసాగుతుందని ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హేమలత, యూసీడీ అధికారి శ్రీవాణి, అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు, మిలటరీ అధికారుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



కంటోన్మెంట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో భద్రతతో పాటు, ప్రజల మధ్య మంచి వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా నార్త్‌జోన్ పోలీసులు పని చేస్తున్నారని డీసీపీ సాదన రష్మీ పెరుమాళ్ అన్నారు. ఈ క్రమంలోనే శనివారం మిలటరీ ఆసుపత్రి సిబ్బంది, నార్త్‌జోన్ పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ మ్యాచ్ ద్వారా పోలీసులు, మిలటరీ వైద్య సిబ్బంది మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో మిలటరీ ఆసుపత్రి కమాండింగ్ ఆఫీసర్ బ్రిగేడియర్ నిఖత్ జహాన్, మిలటరీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాహస్ స్కాలర్‌షిప్

ముషీరాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సాహస్ స్కాలర్‌షిప్ ప్రోగాం 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్‌లో 75 శాతం మార్కులకు పైబడి ఉన్న 15 మంది విద్యార్థులకు అడ్మిషన్, ఎగ్జామ్ ఫీజ్ కోసం రూ. 1,24,590ల ఉపకార వేతనం మంజూరైనట్లు కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ ఎం.రామచంద్రం తెలిపారు. ఉపకార వేతనానికి కృషి చేసిన అధ్యాపకులు, హిందీ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమలను ప్రిన్సిపాల్ అభినందించారు.

వైభవంగా ఇరుముడి పూజ



ఇరుముడి పూజల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు సాయికిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పూజల అనంతరం అయ్యప్ప స్వాముల శబరిమల యాత్రను ఆయన ప్రారంభించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 50, పచ్చకాకర 35, పందిరి బీర 48, క్యాబేజీ 11, క్యారెట్ 33, దొండ 45, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 33, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 11.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి



టీపీసీసీ చీఫ్‌తో నాయకులు

బన్సీలాల్‌పేట్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐ. చిరంజీవి ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, మల్లం రమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. పాలనా భవనంలో ఓయూ ఎన్‌జీవోస్ ఉద్యోగుల సంఘం 2025వ సంవత్సరం కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌జీవోస్ ఓయూ అధ్యక్షులు బి.జ్ఞానేశ్వర్, నాగరాజు, శివశంకర్, అక్బర్‌బేగ్, విజయ్‌కుమార్, భీమయ్య, శంకరయ్య, రవి, అశోక్, శంకర్‌నాయక్, యూసఫ్, భూమరావు, రాకేశ్‌తో పాటు టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మెట్టుగూడ రోడ్డులో లేజర్ స్పీడ్ గన్ ఏర్పాటు



లేజర్ స్పీడ్‌గన్ పనితీరును పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

చిలకలగూడ: సికింద్రాబాద్ తార్నాక ప్రధాన రహదారిలోని మెట్టుగూడ వద్ద లేజర్ స్పీడ్ గన్ ఏర్పాటు చేసినట్లు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. లేజర్ స్పీడ్‌గన్ పనితీరును శనివారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తార్నాక రైల్వే డిగ్రీ కాలేజీ నుంచి మెట్టుగూడ మీదుగా ఆలుగడ్డబావి వరకు వాహనదారులు అతివేగంగా వెళ్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయని, అంతేగాకుండా ఇటీవల హిట్ అండ్ రన్, పెట్రోల్ ట్యాంకర్ బోల్తాపడిన ఘటనలు జరిగాయని, దీంతో వాటి నియంత్రణకు లేజర్ స్పీడ్‌గన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రహదారిలో వాహన గరిష్టవేగం 60 కిలోమీటర్లు దాటితే స్పష్టమైన వీడియో, ఫొటోతో పాటు రూ.1000 చలాన్ విధించేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని పేర్కొన్నారు. నైట్‌విజన్ లేజర్ స్పీడ్‌గన్ రాత్రుల్లో కూడా స్పష్టమైన దృశ్యాలను చిత్రీకరిస్తుందన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలకలగూడ: యువత మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఉజ్వల భవిష్యత్తు నాశనం అవుతుందని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. ఈస్ట్‌జోన్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి శ్రీసాయివిద్యావికాస్ కళాశాలలో భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, రైల్వే డిగ్రీ కాలేజీ విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ పీ మోహనరావు హాజరై భారత రాజ్యాంగ విశిష్టత, హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మద్యం, డ్రగ్స్, సిగరెట్ వంటి మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిస కావద్దని సూచించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అత్యాశ అనేక అనర్థాలకు మూలమని, సైబర్ నేరస్తుల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి డ్రగ్స్ వినియోగించనని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, కళాశాల ప్రిన్సిపాల్ నిషాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఓయూలో విద్యార్థుల మహాసభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఈనెల 5న (నేడు) విద్యార్థుల మహాసభ నిర్వహించనున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ పేర్కొన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట శనివారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి నియామకంలో జాప్యం, విద్యారంగ, హాస్టల్ సమస్యలు, గురుకుల విద్యార్థుల మరణాలతో పాటు పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు తరలిరానున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్యఅతిథిగా ఎంపీ ఆర్.కృష్ణయ్య రానున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంపాల రాజేశ్ విద్యార్థుల మహాసభకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మామిడి సోమశేఖర్, వెంకట్, సందీప్, నరేశ్, హరీశ్, గణేశ్, రాంబాబు, లక్ష్మణ్, కల్యాణ్ పాల్గొన్నారు.

చదువుపై దృష్టి పెట్టాలి


సాక్షి, సిటీబ్యూరో: చిన్నచిన్న ఇబ్బందులను అధిగమించినప్పుడే చదువుపై దృష్టి సారించగలమని రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ ఆర్టీఎన్ చిరంజీవ్ సింగ్ పేర్కొన్నారు. మారేడ్‌పల్లి, నేరెడ్‌మెట్, అల్వాల్ పాఠశాలల్లో పునర్వినియోగానికి అనువైన శానిటరీ ప్యాడ్స్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని బాలికల తక్షణ అవసరాలను గుర్తించి సుమరు 1,400 ప్యాడ్స్ పంపిణీ చేశామని తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు అడిగితే సమాచారం ఇవ్వండి

సనత్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థానిక నాయకులు డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని బేగంపేట కాంగ్రెస్ సీనియర్ నేత విశాల్ సూదం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు సర్వే చేసే సమయంలో కొంతమంది నాయకులు వారి వెంట ఉండి సర్వే పూర్తయిన తర్వాత అధికారులు వెళ్లిపోగానే సదరు నాయకులు దరఖాస్తుదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న సమాచారం తనకు ఉందన్నారు. అర్హులకే ఇళ్లు మంజూరవుతాయని దళారులను, మధ్యవర్తులను నమ్మిమోసపోవద్దని సూచించారు.

గ్రంథాలయాల సందర్శన



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఉపేందర్‌రెడ్డి, పద్మజ

సనత్‌నగర్: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేఓరెడ్డి ఉపేందర్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి పద్మజ శనివారం సనత్‌నగర్, ఎస్సార్‌నగర్‌లోని గ్రంథాలయాలను సందర్శించారు. పుస్తకాలు, వాటి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అలాగే పాఠకులతో మాట్లాడి కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్సార్‌నగర్ లైబ్రరీలో పాఠకుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం ఉన్న రీడింగ్ రూమ్ సరిపోవడం లేదని, పైఅంతస్తులో అదనపు రీడింగ్ ఏర్పాటు చేయాలని పాఠకులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి, పద్మజను ఆయా గ్రంథాలయాల గ్రంథ పాలకుడు హరిబాబు శాలువాతో సత్కరించారు.

బండమైసమ్మనగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో సికింద్రాబాద్ డీటీ రజనీ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులు ఉంటున్నారా..? లేక అమ్ముకున్నారా..? ఉన్నవారి వివరాలు నమోదు చేసుకున్నారు. మొదటి రోజు ఏ, బీ బ్లాక్‌ల్లో లబ్ధిదారుడి ఇంటి పట్టా, ఆధార్‌కార్డు వివరాలు రాసుకున్నారు. 2022 లో రెవెన్యూ అధికారులు బస్తీ సభతో పాటు సమగ్రంగా విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఇప్పటివరకు లిఫ్టులను అధికారులు ప్రారంభించలేదు. దీంతో ప్రజలు పై అంతస్తుల్లోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు సదుపాయాలు లేక తాము అవస్థలు పడుతుంటే పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు.